పుష్పాలు - ప్రేమికులు - పశువులు

★

శ్రీ మునిపల్లెరాజు

౧

అప్పుడే వెలిసిన వానతో నేలంతా సుగంధ వేళ్ళ వాసన కొడుతున్నది. ఆకాశంలో మళ్ళీ రాజ పుటానా జాగీర్లకువలె చీలిపోయి మెట్లు కడుతున్న మబ్బులూ, నీటి బరువుతో తూలుతూ, మెల్లగా వీస్తున్న గాలీ, సోమరిపోతు చుట్టపొగలాగా నల్ల మేఘాలూ, నిండుగర్భిణి నడకతో మబ్బుల కౌగిలింతల్లో సిగ్గుపడుతూన్న సాయంత్రపు సూర్యుడూ, ఎదురుగా ఏడు రంగుల ఇంద్రధనుస్సూ.

జమీందారు శివనాథం గారు మేడ రెండో అంతస్థు బాల్కనీలో, వట్టివేళ్లతడికెలు దాటి, పిట్ట గోడదాకా వచ్చి కిందికి చూశారు. పక్కనే అక్క కొడుకు మధు వున్నాడు—చక్కని అసలు మైసూరు సిల్కు పైజామాలమీద గళ్ల కాశ్మీరీ పొడుగు కోటుతో.

శివనాథంగారు సింహద్వారం వేపు చూశారు. అక్కడ పందిరిపని ఆపి, అతిథిగృహం—"వాణి విలాస" ముందు చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు కూలి వాళ్లు. ఆయనకు చిన్న కోపమూ, వాన చినుకులు కదిలించిన మొగలి మొగ్గలమీది సువాసనా ఒక్క సారిగా వచ్చి తగిలినై. ఆయన ముక్కోపపు అల మళ్ళీ పుట్టినంతలోనే మాయమైపోతుంది.

"చూశావా, అమ్మాయి సాయంత్రం బండికి వస్తుంది. వీళ్ళింకా పందిరే వెయ్యలేదు. ఇంకా తోరణాలు కట్టేదెప్పుడు? లైట్లు అమర్చేదెప్పుడు? ఎందుకే తల్లీ, యింత రాద్ధాంతం అంటే సంధ్య వింటేగా? చెల్లి రాకరాక వస్తున్నది. ఈ మాత్రం అలంకరణగూడా లేకపోతే ఎట్లా అని మారాం చేస్తుంది."

మేనమామగారి మాటకు మధు కొంచెం వులిక్కిపడ్డాడు.

"యివ్వాళ సాయంత్రమా వచ్చేది...? అయితే మన ప్లిమత్ కార్లో దివానుగారు వెళ్ళారేమో కలెక్టరుగారి కోసం...?"

"అయితే నేం? ఫోర్డులో వెళ్ళిసంధ్య అప్పుడే స్టేషన్లో మకాం వేసిందిగా!!"

జమీందారుగారి నవ్వు 'వాణివిలాస' గోడల చాటునవున్న పనివాళ్లకు చక్కగా వినిపించింది. వెంటనే వాళ్ళు పనికి వుపక్రమించారు.

"అయితే నేనూ వెళ్తాను - స్టేషన్ దాకా. పాపం, సంధ్య ఒక్కతే వున్నదేమో"—అని మధు శివనాథంగారి ముఖంలోకి చూశాడు.

మేనమామగారి నిండు పెదిమలనుండి చిరునవ్వు జవాబుగా వచ్చింది.

"ఏమో నబ్బా - నాకు నమ్మకం లేదు. నువ్వుగాని సంధ్యగాని ఛాయను గుర్తుబట్టగలరా నేను లేందే? నేనూ బయలు దేరుతున్నాను పదండి-లావణ్యను తీసుకొని..."

పెద్దకూతురు లావణ్య రాదని ఆయనకు తెలుసు. అయినాగూడా అలా అన్నారు మాటల ధోరణిలో-ఆత్మతృప్తికోసం.

౨

మెయిల్ రావటాని కింకా అరగంట ఆలస్య ముంది. సంధ్యారాణికి వెయ్యి ఆలోచనలు—అరగంటంత పొడుగ్గా వుంది ప్లాట్ ఫారం. రైలులైను అవతలి వేపున యిసికదిబ్బలమీది సరివితోటల్లో మిణుగురు పురుగుల సంకేతాలు. అరగంటలో మెయిలు వస్తుంది. మెయిలు...తను బుద్ధెరిగిన తర్వాత చూడని చెల్లెలుతో మెయిలు వస్తుంది... మెయిలు.... చెల్లి. సంధ్యారాణికి నమ్మకం కుదరటంలేదు...తన చెల్లి... తన అస్పష్టపు భావాల్లో...తన అవ్యక్తపు బాల్య స్మృతుల్లో మాత్రమే నిలిచివున్న చెల్లెలు...యీ మెయిలులో నేనా వచ్చేది?...వస్తుందా?

ఛాయను తన వూహలో చిత్రించుకోటానికి ప్రయత్నించింది. పెద్ద నల్లటికళ్లూ...నవ్వే సన్నటి పళ్లూ... యివి తప్పితే ఛాయ వూహకు అందలేదు. తనకు ఒక చిన్న సంగతి మాత్రం జ్ఞాపకం వుంది. ఛాయ—పెత్తండ్రిగారింటికి పెంపుడు పోకముందు, తల్లి బ్రదికివున్నప్పుడు, తనకు ఏడెనిమిదేళ్ళప్పుడు... అంటే పదిపన్నెండేళ్ళ కిందటిమాట......రోజూ తనకూ, ఛాయకూ, అక్క లావణ్యకూ మధ్య జరిగే గులాబిపూల పోటీలు...! ఒకళ్ళకు తెలీకుండా ఒకళ్లు

తెల్లవారుజామునే నిద్రలేచి, అమ్మగూడా ఎరక్కుండా, దాసీలు వాళ్లు మేలుకోకముందే, పొగమంచులో తడుముకుంటూపోయి, గులాబీ గుబుర్ల దగ్గర కలుసుకోవటం...ఎప్పుడూ ఛాయదే(శీ...తనది చుక్క......అక్కడ అందరూ నవ్వుకోవటం... ఛాయవి ఎంత అందమైనకళ్లు....? నవ్వేటప్పుడు ఆ పళ్లు కూర్చిన సన్నముత్యాలై...ఈ పదిపన్నెండేళ్లలో ఎంత మారిపోయిందో....!!?

లావణ్య నవ్వేదికాదు. తను ఓడిపోయానని ఏడుపు మొదలెట్టేది. లావణ్య అప్పటికీ యిప్పటికీ అంతే. ప్రతి స్వల్పవిషయానికీ అన్ని రాద్ధాంతాలు కల్పిస్తుంది. అబ్బ—మనుషులకు అంతెంత కుళ్లు. దానికి తగిన మొగుడే దొరికాడు. ఎప్పుడూ నాన్నగారిని వుబ్బించి, మోసంజేసి డబ్బు కాజేయటం. లావణ్యకు తృప్తి అనేది లేదు. అందరికీ సంతోషం, ఆహ్లాదం కూర్చే విషయాలుగూడా దాన్ని కదిలించలేవు. పిన్ని ఒకతె దొరికింది...యింకేంగావాలి?...అహర్నిశలూ గుసగుసలూ, పకపకలూ, నూటీలు, పోటీలు...యీసులూ...వాళ్ళ ప్రపంచానికి సరిహద్దులు అవ్వే...ఆ సొమ్ములూ, చీరెలూ, దాసీల పొగడ్తలూ, దొంగ గౌరవాలూ.

ఛాయ వస్తుందని తెలిసినా వాళ్ళిద్దరికీ చీమ కుట్టినంతగూడా లేదు. పోనీ, పిన్నికి ప్రేమలేకపోవచ్చు. ఎంత పిన్ని అయినా సవతితల్లి అమ్మ కాదుగదా...! కాని...లావణ్య...!!! లావణ్య... తమతోపాటు ఒక్క తల్లి కడుపున పుట్టిన లావణ్య.. దానికి బొత్తుగాలేదు. అది ముగ్గురిలోనూ పెద్దది. జీవితానుభవం గలది. తల్లిపోయింది...అమ్మ!... అమ్మ లేదు...పది పన్నెండేళ్ల తర్వాత మొదటిసారిగా వస్తున్న ఛాయను ఆదరించవలసిన బాధ్యత దానిది. అమ్మలేని చిన్న చెల్లి...కాని చిన్నప్పటి లావణ్య ఏమీ మారలేదు...ఆ యేడుపు, ఈర్ష్య, గర్వమూ...కాని అమ్మ...అమ్మే వుండగూడదూ... అమ్మ జ్ఞాపకం వస్తుంది. కళ్లు చెమ్మగిల్లుతాయ్... అమ్మే వుంటే తన్ను యిట్లా ఒకర్తెనూ పోనిచ్చేదా? ఏ పదిమంది దాసీవాళ్ళనో యిచ్చి...నాన్నను తరిమి వుండేది కాదూ?

* * *

మధువచ్చి ఆ అనంత ప్రవాహానికి ఆనకట్టగా నిలుచున్నాడు. తన వాడైన మధు !!

చక్కిలిగిలి...చిన్నప్పుడు ఛాయగూడా యిదేవరస. ఎప్పుడూ వాళ్ళిద్దరూ ఒకటి...లావణ్య కలిసేదేకాదు.

"యిదుగో నిన్ను యిటువంటి పనులే చేయవద్దని చెప్పేది...మాట్లాడ రేమండీ...మిమ్మల్నే... ఓ రాణీగారూ......!"

తనకు నవ్వు వస్తున్నది. అబద్ధపు కోపాన్ని నిజమని చూపేందుకు మధు చేసే వ్యర్థప్రయత్నాలు చూస్తుంటే.

"నేను "గారిని" కాదని లక్షసార్లు చెప్పానండీ"

"నేను అండీని కాదని..."

"అండీ కాకపోవచ్చు గాని మొండీమాత్రం అవుతారు"

"మొండివాళ్లు దొంగలకన్నా ఎప్పుడూ నయమేగా"

"దొంగలు యిలా ప్రత్యక్షంగా కనపడరు. అదీగాకుండా దొంగతనం లేని దొంగలుంటారా ?"

"మరి మాతో చెప్పకండా, రాత్రిళ్లు చలిగాల్లో కార్లు తీసికెళ్లేవాళ్లో...?!"

మళ్ళీ చక్కిలి గింతలు...

"అదుగో నాన్నగారు గూడా వచ్చారు..."

3

సన్నగా, పొడుగ్గా అప్పుడే శరత్కాలపు మబ్బుల్లో స్నానంచేసి వస్తున్న దేవకన్యలాగా, తెల్లని బెనారస్ సిల్కు చీరమీద బుట్టచేతుల ముఖమల్ జాకెట్టుతో ఛాయ...మొగల్ రాకుమార్తెలను మరిపిస్తూ...మెయిల్ నించి దిగింది. తోడుగావచ్చిన దాసీ, పురోహితుడూ ముందుదిగి జవాన్లు అందిస్తున్న సామాన్లు సర్దుకొంటున్నారు. జమీందారుగారు, పన్నెండేళ్ల కిందట తన అన్నగారింటికి దత్తతపోయిన చిన్నకూతురు లలాటాన్ని స్పృశించారు. శిరసుమీద కేశాలుసర్దుతూ ముద్దిడుకొన్నారు. ఛాయ వంగి నమ్రతతో నమస్కారం చేసింది.

"సంధ్యక్క..." నవ్వింది. ఎంత చక్కటి నవ్వు? చిన్నప్పటి ముత్యాల పళ్ళవరస...తన సన్నటి చేతుల్తో అక్క నడుం చుట్టవేసింది.

"లావణ్య అక్కేదీ...?"అన్నది చుట్టూచూసి.

"రాలేదు...దానికి ఒంట్లో బాగులేదు."

"ఔను...నాకు...తెలుసులే."

ఇద్దరికీ ఒక్కసారిగా నవ్వొచ్చింది. కొంచెం దూరంగా కోటుజేబుల్లో చేతులతో మధు అక్కచెల్లెళ్ల వంక చూస్తున్నాడు.

"మధు బావను బొత్తుగా నువ్వెరగవుగా ?" శివనాథంగారి సగం ప్రశ్న.

ఛాయ బరువు కనురెప్పలు ఒక్కసారి ఆశ్చర్యంగా పైకిలేచి కిందికి వాలాయ్. ఆ పెద్దకళ్ల సిగ్గు ప్లాటుఫారం లైట్లమీద ప్రసరించటం మధు గమనించక పోలేదు. ఛాయ తలమీది పమిటె లాక్కొని కార్లో అక్కపక్కనే కూర్చొన్నది.

౪

శుక్లపక్షం వచ్చింది. పోయింది. ఆదివారాలు, కాలపు అడుగులేని గర్భంలో కలిసి సోమవారాల సాయంత్రపు జ్ఞాపకాల్లో మాత్రం నిలిచివున్నై. ఎన్నో నిన్నలు. కాని పన్నెండేళ్ల ఎడబాటును ఈదిన, అక్కాచెల్లెలూ తమ సంభాషణల అంతు చూడలేకపోతున్నారు. బాల్యక్రీడల స్మృతుల నెమరులో, తావులేని వర్తమానం, అదృశ్యమైవున్న భవిష్యత్తూ గూడా తమ ప్రాధాన్యతను పోగొట్టుకొన్నై. పుస్తకాలూ....కళా....పిన్ని......లావణ్య...... నాట్యం......బాల్య స్నేహితులు...కన్నీళ్లు...... నిరాశ......అమ్మ...పెద నాన్న...నాన్న...... మధు...ఆ సంభాషణల చుట్టూ తిరుగుతున్నారు.

ఎన్నేళ్లో లావణ్య కుళ్ళు మాటల్లో, పిన్ని కుట్రల్లో గడిపిన సంధ్యారాణికి కలల్లోని చెల్లెలు కొత్త జగత్తును సృష్టించి తెచ్చింది. గులాబీల పరిమళాలు, మాటల శోభకు అతీతమైన మలయమారుతమూ యీ కొత్తలోకపు సింహద్వారాలై ఆహ్వానిస్తున్నై. ఈ కుళ్లూ, యీ సామాన్యత, ఎన్నో లోపాలూ... అన్నీ వెనకటి కథలు. ఇప్పుడో...తన హృదయ కవాటాలన్నీ విప్పి యిప్పుడు చెల్లికి చూపగలదు. చావులేని తన కలలను మాటల్లోకి మార్చి చెబితే... సానుభూతితో విని ఆనందించి, ఓదార్చగల చెల్లి. తెలివిగల చెల్లి. ఎవరి సహవాసానికి దూరమై ఇన్నేళ్లూ వ్యర్థపుచ్చానని విచారించిందో...ఆ చెల్లెలు...... ఛాయ ఒంటరిగా పెరిగినపిల్ల. కాని యిక్కడో తన అక్క...తనూ, దీర్ఘ చలికాలపు రాత్రుల్లో రగ్గుల వెచ్చదనంకింద పడుకొని ... కన్నీళ్ళు కార్చుతూ ... ఆలోచించి ...ఆలోచించి...అలసి నిద్రించే రోజుల...అక్క...ఏదో అవ్యక్తమై, అదృశ్యమై యిన్నాళ్ళూ తనలో దాగివున్న అక్కమీద అనురాగం ... అక్కకు హత్తుకుపోయి ... మళ్ళీ ఎన్నడూ ఎడబాటులేకండా...యిట్లా...ఎప్పుడూ ....యీ చిన్ననాటి తోటల్లో ఆడుకొంటూ....ఆ పొదరిళ్ళలో దాగులుమూత లాడుతూ...చెరువుగట్లూ జాజి మొక్కలూ...యీ నీడా...అబ్బ...అక్క వుంటే చాలు...! పెదనాన్నగారి శిష్టాచార నాగరికతనుండి....నవ్య సంస్కారం పుట్టిపడే...నాన్నగారింట్లోనే బావుంటుంది. అక్కయ్యా...తనూ... ఒకటిగా...ఎప్పుడూ...

"నాన్నగారూ పెదనాన్నగారూ పన్నెండేళ్లయిందట మాట్లాడుకొని..."

"నాన్నగారు సీమ వెళ్లొచ్చి ప్రాయశ్చిత్తం చేసుకోలేదట...అసలు తగాదా అక్కడే వచ్చింది."

"నాన్నగారు సంస్కారప్రియులు"

"పెదనాన్నగారు అంత కటువుగా కనబడతారు గాని వారి హృదయం నవనీతం లాంటిది. దేశీయతంటే వారికంత మమకారం! నన్ను యింగ్లీషు చదువుకోవద్దని శాసించారు—సంస్కృతంలో పంచకావ్యాలూ, వీణె, భరతనాట్యం..యివ్వే మన నాగరికతకు సంప్రదాయాలకు చిహ్నాలని...నాకు వీటినే... నిత్యమూ వుపాధ్యాయులచేత నేర్పించారు..."

"అయ్యో, నాన్నగారైతేనా? యిక చెప్పేదేముంది? అంతా దొరల తతంగం. పేర్లన్నా, సాహిత్యమన్నా ఎంత యిష్టమని. వారి గ్రంథాలయం నిండా యింగ్లీషు, బంగాళీ పుస్తకాలు తప్పితే—యింకోటి లేదుగా. అసలు మన పేర్లు చూడు... సంధ్య...ఛాయా...యా......"

"లావణ్యా...లావణ్య పేరు చెప్పవేం..."

"......................."

"లావణ్య మనతో ఎప్పుడూ కలియదు... నేను వచ్చి రెణ్నెల్లు కావస్తోన్నయి కదా...యింతవరకు ఒక్కసారైనా సరిగ్గా పలకరించిందీ?"

"అబ్బ, దాని కుళ్లు ఎప్పుడూ...అంతేలే..."

"నీకు జ్ఞాపకం వుందీ చిన్నప్పుడూ...... "

"అహ్హా...హ్హా......"

"అమ్మ చచ్చిపోయే ముందు నాన్నగారిని పిలిచి అన్నదట...'లావణ్య తెలివిగలది. అది బదకనేర్పరి. మీరు సంధ్యనూ ఛాయనూ వెయ్యి కళ్ళతో పెంచాలి—' నాన్నగారినుండి అలాగే వాగ్దానం తీసుకొన్నదట. నాన్నగారికి పట్టుదలలు జాస్తి... చివరకు పెదనాన్నగారే నామాటలకు సడలి నన్ను వెళ్ళి చూచిరా అమ్మా అని పంపేరుగాని..."

"మధుకు అంతసిగ్గు. మొన్న అంటున్నాడు—ఛాయ అంత చక్కగా డాన్సు చేస్తుందని తనకు తెలీదట."

సిగ్గు ఆవరించగా, కాటుకలాంటి తన నల్లకళ్లను కిందికి వాల్చింది.

"అబ్బ...మధు ఎన్ని సిగిరెట్లు తాగుతాడని? ఒకటయిపోగానే మరొకటి!"

ఛాయ మాట్లాడలేదు. సంధ్య చెబుతున్నది. తేలిపోతూన్న కళ్లు దూరాన ఏదో ఆశనో అమృతాన్నో చూస్తున్నట్లుగా...సన్నని ఎర్ర పెదిమల వంకల్లో చిరుచెమటలు...

"మధు తిరిగి కాలేజిలో చేరడట. నాన్నగారు అమెరికా పంసిస్తున్నారు—యింనీరింగు కోర్సుకు."

రాబోయే రోజుల కలల్ని సంధ్యముందే వూహించుకొంటున్నది. మధు అమెరికాకు బయలుదేరకముందే తమ పెళ్లి నిశ్చయిస్తారు నాన్నగారు... అంతదూరం బాబూ....మధును ప్రతిరోజూ ఒక్క

వుత్తరమన్నా వ్రాయమని చెప్పాలి...వచ్చేఏడు మధు...తిరిగివచ్చి...తనను గూడా అమెరికా తీసుకెళ్ళేట్లుగా...నాన్నగారిచేత..... చెప్పించాలి...... అబ్బా......నాన్నగారితో ఎట్లా చెప్పటం...సిగ్గేస్తుంది...

పెళ్లిమాట చెల్లికి చెబుదామని పెదిమలమీదికి వచ్చింది...

మధు మాట వచ్చేసరికి...తరవాత చెప్పొచ్చులే...చెల్లిని వదిలి తను అమెరికా వెళ్ళాలంటే... మధు అశ్రద్ధ మనిషమ్మా......అజాగ్రత్తలవల్ల...... ఆరోగ్యం పాడుజేసుకుంటాడు......

ೱ

లావణ్య నవ్వు చాలా అరుదైనది. నవ్వితే, అది ఎవరిమీదనైనా విరుచుకుపడటానికో లేక కసి తీర్చుకో నేమాట లనడానికో......ఈ సంగతి జమీందారుగారి వూళ్ళో, యింట్లో ఆబాలగోపాల మెరిగిన విషయం...

"ఒసే, గంగా! ఆ సన్నజాజిపూలన్నీ ఎవరికే?"—

లావణ్య పెదవులమీద విషపుచిరునవ్వును అనుభవం గల దాసీ గంగ వెంటనే గమనించింది.

"చిన్నమ్మగారు తెమ్మన్నారు—" ఇంకా అక్కడ వుండటం ప్రమాదమని గంగకు తెలుసు.

తూర్పువేపు వరండాలో పరిషియన్ రగ్గుమీద—సంధ్య, ఛాయ సన్నజాజిమాలలు గుచ్చటం తలుపు చాటునుండి చూసింది లావణ్య. అక్కడనుంచే సంధ్యకు వినబడేట్టుగా—"పిన్నిగారూ,... ఓ పిన్నిగారూ...నిన్నణ్ణించీ అనుకొంటున్నాను, ఆ సన్నజాజిపూలు గిల్లించుదామని" అన్నది.

పిన్ని కంఠం—"అయితే యిప్పుడేం మించిపోయిందీ?...గంగను పంపి గిల్లించు."

సంధ్య గ్రహించింది. ఈ మనుషులది ఎంత వక్రబుద్ధి! ఈ సిల్కుచీరెల కింద, యీ నాజూకు జాకెట్ల కింద, యీ ఆడంబరపు అందాల కింద ఎంత నల్లని హృదయాలు !!

"నేను కోయించానండీ పిన్నిగారూ! ఛాయా, నేనూ చెండ్లు కడుతున్నాం" అని తను తిరిగి కేకేసింది.

లావణ్య మెలికల మనస్సు అంత చక్కటి సూటి జవాబును ఓర్చలేకపోయింది. వరండాలోకి, ముఖం చిటమట మాడ్చుకుంటూ వచ్చింది.

"అవున్లే, ఛాయా నువ్వూ పంచుకుంటే చాలుగా. ఆ పచ్చ చామంతులుగూడా అన్నీ అట్లాగే వున్నై. వాటినిమాత్రం ఎందుకు వదిలావో? ఛాయ పెట్టుకుంటుం దేమో"—ఆ చూపులోని ప్రతి కిరణంలో, ఆ మాటల్లోని ప్రతి అక్షరంలో, పొల్లులో, ఆ పెదిమల వంకర్లలో ఈర్ష్య, అసహనం వుట్టిపడుతోంది. ప్రతిధ్వనిస్తోంది. నగ్న నాట్యం చేస్తోంది.

ఛాయ అక్కడ ఒక్కక్షణం కూర్చొనలేదు. గిరుక్కున తిరిగి మెట్లు దిగిపోయింది—సన్నజాజుల్ని రగ్గుమీదనే వదిలి. ఛాయ కళ్ళల్లో ముత్యాల్లాగా కన్నీళ్లు కదలటం సంధ్య గ్రహించకపోలేదు. తనేమి చేయగలదు? లావణ్యవేపు యేహ్యంగా ఒక్కసారి చూడటం తప్పితే ??

*　　*　　*　　*

దిగులుగా, తోటపక్క చెఱువులోని చలనం లేని నీళ్లను చూస్తూ ఒంటరిగా కూర్చొనివున్న ఛాయ—అరగంటసేపటికి గాని తిరిగి కనిపించలేదు. రాకరాక వచ్చిన చెల్లి, మళ్ళీ తనలాగానే యీ కుళ్లు వాతావరణంలో చిక్కుకొని యిలా మూగగా బాధపడటం !

"ఇదిగో చిట్టీ! నీకు యిదివరకే చెప్పలే? లావణ్య మాటల్ని మనం లెఖ్ఖచెయ్యకూడదు. దాని కుళ్ళుతో అదే బాధపడుతుంది. మనకేం నష్టం ?" చూస్తూండగానే ఛాయకళ్ళల్లో నీళ్లు నిండినై.

"అక్కా..." అని సంధ్యమెడను గట్టిగా పెనవేసుకొన్నది - సంపెంగ కొమ్మను పాకి పెనవేసుకొన్న గోధుమ త్రాచులాగా.

"అయితే...సంధ్యక్కయ్యా ! నీకు బాగా ఈత వచ్చునన్నావే"

"అవును...వాళ్లందరికన్నా.

"నాకు బొత్తుగా రాదు"

"ఓసి...అదెంత పని ? నీకు రొండురోజుల్లో ఈత నేర్పుతాను. ఈ చెరువులో నేనూ, లావణ్యా, మధూ అనేకసార్లు పందాలు కట్టి యీదాం. మధుకు లోతంటే మహాభయం. అసలు ఆమూల ఒక సుడి వున్నది. అటువేపంటే రానే రాడు. ఇకలావణ్యా? నాలుగు గజాలకన్నా...."

ఏ సంభాషణలోనైనా సరే మధును తగిన స్థానంలో యిరికించకపోతే సంధ్యకు తృప్తి వుండదు.

లావణ్యమాట ఎత్తగానే ఛాయ—అప్పటిదాక నాగస్వరం వింటోన్న పాములాగా ముగ్ధురాలైవింటున్నది ఘటుక్కున—"అబ్బ—ఆకుళ్లు ముచ్చుమాట నాముందు ఎత్తకు—అయితే, నాకు రొండురోజుల్లో వస్తుందంటావా ?"

"ఓ!"

"అయితే నాకు రేపు నేర్పాలమ్మాయ్!"

"ఎల్లుండికి మధుకన్నా నువ్వే బాగా ఈదగలవ్"

"మాద్దాంగా"

*　　*　　*

౬

మధు పుట్టినరోజు పండుగ.

ఉదయానే శివనాథంగారి చురుకు అజమాయిషీ క్రింద తలంట్లూ, ఫలహారాలూ, బ్రాహ్మణ సత్కారాలూ ముగిసినాయి. మధ్యాహ్నం విందు.

మధు అమెరికా వెళ్ళేముందు, బహుమతిగా, అనుకుణ స్మృతికై తను యివ్వదలచిన చేతిగడియారపు గొలుసూ, ముత్యాలు పొదిగిన బంగారపు గుండీలూ, అతని "ఆరవప్రాణం" గోల్డుఫ్లేకు సిగిరెట్టు టిన్నులూ, అన్నీ పెట్టెలోంచి పెళ్ళగించింది సంధ్యారాణి.

మధు పుట్టినదినం పండక్కన్నా మంచి అదను దొరకదు—యీ బహుమతులకు. అంతగా అయితే అమెరికా ప్రయాణ మప్పుడు యింకేవైనా వస్తువులు, మంచివి చూసవచ్చు.

తోటలో ఒక్కడే మధు కూర్చొని వుండగా, నక్కి నక్కి, వెనకగా వెళ్ళి వాటిని ముందు వుంచింది.

"అ...రే...ఛాయా....సంధ్యా....సంధ్యా! నేను సిగరెట్లు మానేశానుగ—బొత్తుగా తాగనని వాగ్దానం గూడా చేశాను."

కొంచెం చిన్నపోయింది సంధ్య.

"ఎవరికి ?"

మధు కొంచెం బిత్తరపోయినట్లుగా కనిపించాడు.

"ఎవరికేమిటి ?......నాకే... నేనే వాగ్దానం చేసుకొన్నాను."

"భేష్... భేష్... ఇన్నాళ్ళనుంచీ నేను పోట్లాడగా, పోట్లాడగా యిప్పటికి వదిలిందన్నమాట... యీ సిగరెట్ల మత్తు."

"అరే...యీ గొలుసు గూడా...యింత ఖరీదైన గొలుసు యిప్పుడెందుకొన్నావ్ ? నిన్ననే కొత్తది కొనుక్కొన్నానే...అంటే...కొనుక్కోలేదనుకో...ఆ యిచ్చిన వాళ్లు గూడా యిట్లాగే హఠాత్తుగా..."

"ఎవరన్నావు మధూ !" అని మధు ముంజేతి మీద చొక్కా మడతను పైకి తీసింది. చక్కని క్రోంచి గొలుసు.

"ఎవరిది మధూ యీ బహుమతి ? నీ యిష్టాయిష్టాలన్నీ తెలుసా ఏమిటి వాళ్లకు ?"

"అబ్బే...ఎవరూ లేదు...నిన్ను వుడికించటానికి అలా అన్నాను గాని అసలుకొన్నది నేనే."

సంధ్య అతని కళ్ళల్లో కళ్ళుంచి చూసింది. మధు వెలా వెలాపోయి కళ్లుకిందకువాల్చుకొన్నాడు. కాని కొంచెం విసుగుదలతో—

"యీ గుండీలు ఎన్నిడజన్లున్నాయ్ నా పెట్టెలో, ఎందు కివన్నీ ?" అన్నాడు.

ఎన్నాళ్ళనుండో, మధురంగా వూహించుకుంటూ యీ శుభదినానికై, కోరి దాచి వుంచిన యీ అందమైన వస్తువులు! కిందటి వేసంగిలో తనూ, మధూ బెంగుళూరు వెళ్ళినప్పుడు మెచ్చుకొన్న బహుమతులు !!

సంధ్య కళ్ళ నీళ్ళు గిర్రున తిరగినై. తనవాడైనమధు ఏమిటో యిలా మాట్లాడుతున్నాడు.

౭

దిగులుగా సంధ్య అంతా గమనిస్తోన్నది గాని మధులో ఏదో పెద్ద మార్పో, చిన్న మార్పో వచ్చింది. మన్ను దిన్నపాములె మాట్లాడక కూర్చుంటాడు. వెనక ప్రతిసాయంత్రమూ క్లబ్బుకు వెళ్లేవాడు- నలుగురు మెంబర్ల టెన్నిస్ క్లబుకు. ఇప్పుడు అదీ లేదు. తోచనప్పుడు కాల్చిన సిగరెట్లు, లేక తనతో కబుర్లు. అన్నీ ముందు ఆలోచనలు. కాని యిప్పుడో? ఏమాట వచ్చినా "అబ్బ ముందు ఆలోచనలు చేయకు సంధ్యా—" అని మందలింపుగా, బరువైన విసుగుతో త్రోసి వేస్తాడు. ఇంత హఠాత్తుగా సిగరెట్లు మానివేశాడు. కావాలని ప్రయత్నంతో తనను తప్పుకొని తిరుగుతున్నట్లుగా తోస్తున్నది.

సంధ్యకు అర్థం కాలేదు. ఎవరితో చెప్పుకొంటుంది? తన హృదయంపైన యీ కొత్త బరువు, యీ కుంగదీసే మధు దిగులు—ఎవ రర్థం చేసుకోగలరు? ఛాయ ఒక్కతే తన కా యింట్లో ఆప్తురాలు. ఛాయకన్నా చెబితే హృదయం తేలికపడుతుందేమో. పాపం, దానికేం తెలుసు, వట్టి అమాయికురాలు. అసలు తనింతవరకూ మధును పెళ్ళిచేసుకోబోతున్న సంగతి ఛాయకు చెప్ప లేదుగా. యివ్వాళ చెప్పాలి. సాయంత్రం "వాణీ విలాస"లో వుత్తరాదినుండి వచ్చిన మణిపురి నటకుల నాట్యప్రదర్శనం. అక్కడకైనా మధును తీసుకుపోవాలి.

మొదట ఛాయను వెతుకుతూ పోయింది. ఇందాక పూలుగుచ్చుతోంది. ఏదీ యిప్పుడు? దానికి పూలంటే ఎంత యిష్టమని?!

"గంగా! చెల్లిని చూశావా?"

"లేదమ్మగారూ! యిందాకట 'గ్రామఫోను' పట్టించుకొని తోటయింట్లోకి వెళ్లారు."

తోటయింటికి దక్షిణంగా వెళ్ళాలి. దానికి రెండువేపులా పెద్ద వరండాలు. వేసంగుల్లో చల్లద

నానికై శివనాథంగారి హయాంలో కట్టించిన బంగళా అది.

సంధ్య వెతుకుతూ వెళ్ళింది. ముందు వరండాలో గాని, ప్రక్కన గదుల్లో గాని, మధ్యహాలులో గాని ఎక్కడా కనిపించలేదు ఛాయ. బయటి వెనుకపక్క వరండా చూడకుండానే, తిరిగి పోతూండగా ఛాయే, గులాబిపొదల పక్కనే పాలరాతి అరుగు మొగన ఎదురొచ్చింది.

"చెల్లీ...నీకోసం వెతుకుతున్నాను."

"....................."

"భరతనాట్య ప్రదర్శనానికి రావా యేమిటి?"

ఛాయ మెల్లగా "వస్తానక్కా!" అంది.

"గ్రామఫోను పట్టించు కెళ్ళావటగా..అదేదీ?"

ఛాయ తన చూపుడువేలును బయటి వరండా వేపు నిర్దేశించింది.

"మనం భోంచేసి తయారు గావాలి. వాణీవిలాసవేపు అందరూ అప్పుడే బయలుదేరుతున్నారు. నువ్వు పద, నేను గంగచేత ఫోను పట్టించుకొస్తాను." సంధ్య బయటి వరండా వేపు దారితీసింది.

అరే...మధు.

పడక కుర్చీలో కాళ్లు చాచుకొని, కళ్లు మూసుకొని పడుకొనివున్నాడు మధు. పక్కనే నల్లటేకు బర్మా టేబిల్ మీద గ్రామఫోను. దానికి ఆనించి యిన్ని హిందీ రికార్డులు. హిందీ రికార్డు లంటే మధు చెవి కోసుకుంటాడు. సైగల్ పాటలన్నీ ఏరి ఒక మూల పేర్చేవాడు.

అ వేమిటి? కాయితాలు. మధు వేమో. అంత చిందరవందరగా యింకెవరు పారేస్తారు? అన్ని చిత్తుకాయితాలు. అది....ఏదో వుత్తరంలావుంది. సంధ్య పరికించి చూసింది. వుత్తరంకాదు. నిరంజన్ మల్ కంపెనీ, బంగారంవజ్రపు పనివాళ్ల బిల్లు. ఒక చైనాఫాషన్ బంగారపు చేతిగడియారపు గొలుసు (రాళ్లతోసహా) రెండువేల అయిదువందల రూపాయలు." ఆ కింద తెలుగులో ఎవరిదో చిన్న దస్తూరి. "నువ్వు సిగరెట్లు తాగటం బొత్తుగా మానెయ్యాలి." సంతకంలేదు. నిన్న మధు అన్న గడియారపు గొలుసు యిదేనేమో. ఏ స్నేహితులు యిచ్చివుంటారబ్బా?

"అరే....సంధ్య....భలే........ఎంతసేపయిందేమిటి నువ్వొచ్చి?"

సంధ్య వెనక్కు తిరిగిలేచింది. మధు కళ్లు నులుముకుంటూ కుర్చీనుండి లేచాడు.

"ఇవ్వాళ వంట్లో ఏమీ బాగులేదు సంధ్యా! ఇక్కడకొచ్చి చూశాను. ఈ కుర్చీ ఖాళీగా వుంది. అంతే ఎప్పుడు పడుకొన్నానో...ఏమిటో..."

సంధ్య కుర్చీ రెక్కమీద కూర్చొని అతని గుండీలు సర్దింది. కాలరు సరిజేసింది.

"నిన్న.....నాన్నగారు......దివానుగారితో చెప్పగా విన్నాను. మన...పెళ్లి శ్రావణమాసం వెళ్లగానే స్థిరపరుస్తారట మధూ!" సంధ్యను కన్యలకు సహజమైన సిగ్గుతెర ఆవరించింది. మధు భుజంమీద తల ఆనించి, తన జడను ముందుకుపడునట్లుగా జారవేసింది.

"అబ్బ!...అంత తొందరేమొచ్చింది? నేను అమెరికా వెళ్ళివచ్చిందాకా వుంటే మునిగిపోయేదేమున్నది?" అతని ముఖంలో చికాకు విస్పష్టంగా ప్రతిబింబిస్తున్నది.

సంధ్య చలించింది. తనవాడైన మధు అన్న మాటలేనా యివి? ఈ శ్రావణం వెళ్లటం కోసం... ఎన్నియుగాల వేదన, ఎన్నెన్ని తపస్సులు, ఎన్ని తపస్సుల నిష్క్రమణకు నిరీక్షణ!! తనకు తానై మధు యిదివరకెన్ని సార్లన్నాడు? "మన పెళ్ళి నేను అమెరికాకు వెళ్ళకముందే జరగాలని."

ఆ మధు...ఏడీ? ఈ చికాకు...యీతప్పుకు తిరిగే మధు. సంధ్య తన చెవులను నమ్మలేదు. కాని యిదిసత్యం. అమెరికావెళ్ళి అక్కడ ఒకసంవత్సరం గడిపినతర్వాత, తనను గూడా మధు తీసుకెళ్తానని చెప్పినమాటలు...యిప్పుడూ? అవ్యక్తమై, మాటలకందని వేదనతో కఠిన సత్యం ముందు నిలిచింది. ఎన్నో ఆశల నిరాశగా, ఎన్నో మధుర స్వప్నాల తర్వాత పీడకలగా, ఎన్నో పున్నములు గడిచిన అమావాస్య కాళరేయిగా, నిశ్శబ్దపు భయంకరయాతనై యీకఠిన సత్యం తనముందు, పరిష్కరింపబడలేక, పరిష్కరింపబడకనిలిచివుంది. నిలిచివుంది నగ్నంగా. నిలిచివుంది విషపు నవ్వుతో. "మధు తనవాడేనా?"

౮

చెఱువు అనటంకంటె దాన్ని సరస్సు అనటం సమంజసం. అది తరతరాలనుండీ జమీందారుగారి కుటుంబానికై ప్రత్యేకించబడివుంది. మొన్నమొన్నటి దాకా, దానికి మరామ్మత్తులు లేవు; కాని పిల్లలు ఎక్కువచ్చినతర్వాత వాళ్ళవత్తిడి వల్ల శివనాథంగారు, సరస్సువిషయమై కొంత శ్రద్ధ తీసుకొనక తప్పిందికాదు. దానితో గట్టుమీదదట్టమైన చింతచెట్లు కొన్ని, నాగుజెముడుపొదలు కొన్ని శుభ్రంగా తుడుచుకొని పోయాయి. మెట్లువున్న మూడు వైపులా తప్పిస్తే, నాలుగోవైపున తెల్ల తామరలూ, ఎర్రతామరలూ, వత్తుగా పరచుకొని ఆకులతో ఆ మూలనంతటినీ కప్పివేసినై. తామరపూలను పండగరోజుల్లో మాత్రమే కోయటం అలవాటుగా, కుటుంబాచారంగా వస్తూ

వుంది. కిందటి సంవత్సరమే మధు రంగుచేపలు రకరకాలవి తెచ్చి వేశాడు. దూరంగా మూడు వేపులా వున్న కంచె, బయటివాళ్లకు—లోపల చెరువొకటున్నదన్న స్ఫురణనుగూడా తెలియజేయనీదు. అందుకని సంధ్యదాన్ని "దేవ సరస్సు" అంటుంది.

౬

దేవ సరస్సులో నీళ్లు తొణికిసలాడటం లేదు. మధ్యాహ్నపు బలవంతపు నిశ్శబ్దంలో, పడమటకు తిరిగిన ప్రొద్దు ఒక్కటే లోతు నీళ్లతో పరిచయం చేసుకొంటున్నది.

సంధ్య అనుకొంటున్నది—

"మధు తనవాడేనా ?"

చెరువులో నీళ్లు పైమట్టంకింద చల్లగా, మృత్యువుకంటె చల్లగా, మధు కల్పించిన నిరాశగా, శరీరానికి తగులుతున్నై.

ఛాయ—

"ఎందుకక్కా...అట్లా వున్నావ్ ?"

"............"

"మాట్లాడవూ ?"

"............"

"ఏమిటాలోచిస్తున్నావక్కా !"

తను మాట్లాడగల స్థితిలో, మనః స్తిమితతో వున్నదా? ఛాయ గూడా అక్కడ లేకపోతే, జీవితం యింకెంత నిస్పృహగా వుండేదో?......నిజానికి మధు - తన హృదయంలో అంత గాయం చేస్తున్నానని గ్రహించక అలా అనివుంటాడు......ఇంకో అర గంటలో రాడా? మళ్ళీ వస్తాడు...నవ్వుతూ క్షమాపణలు వేడుతూ. అన్నీ...దిగుళ్లూ...పిచ్చి ఆలోచనలూ మళ్ళీ మరిచిపోయి, తనూ తనవాడైన మధూ...!!

ఒక్కసారి వుప్పెనలాగా సంతోషం వచ్చింది సంధ్యకు.

"చూశావా ? నీవప్పుడే మునిగి యీదటం గూడా నేర్చుకొన్నావ్!" అన్నది చెల్లెలు ఛాయతో.

ఛాయ, తన విద్య మరొకసారి జయప్రదంగా ప్రదర్శించటానికి, నీళ్లలో మునిగి తేలి, ముఖంమీది చుక్కల్ని తుడుచుకొన్నది—"నాకింకా ఆ మూల లోతునీళ్లలోకి వెళ్లటమంటే భయంగా వుందక్కా !"

ఛాయ సన్నటినవ్వు గట్టుమీది చెట్లకొమ్మల్లో యింకా సన్నగా ప్రతిధ్వనించింది. సంధ్య తిరిగి చూసేసరికి, అప్పుడే పదిగజాలు యీదుకుంటూ పోయింది. సంధ్య తనకూ మధుకూ జరిగిన ఈత పోటీలను స్మృతికి తెచ్చుకొంటున్నది. లోతునీళ్లంటే భయపడే మధును, ఎన్నిసార్లు తను ఆ వేపుకు తీసుకెళ్లింది? ఎన్నిసార్లు...నీళ్లకింద ఒకళ్ళ దేహాలు ఒకళ్ళకు తాకుతూ...

"అక్కా !...అక్కా...యిటు చూడవూ ?" ఛాయ సన్నటి నడుం! కాశీమజిలీ కథల్లో బంగారపు చేపలాంటి రాచకన్నెవలె యీదుకుంటూ, మునుగుతూ తేలుతూ !

"అదుగో...మళ్లీ ఏమిటో ఆలోచిస్తున్నావ్ ?"

ఈమాటు సంధ్య పూరకొట్టింది.

"తామరపూలు...సంధ్యక్కా !"

"కాదు...అవినీటి పారిజాతాలు."

"పారిజాతాలా ?!!! యింత చక్కగా..."

ఛాయ ఆశ్చర్యంగా చూడటం, ఆ చక్కని పలువరస-మళ్లీ మధు దిగులును మరిచిపోయింది సంధ్య.

"సంధ్యక్కా !... పారిజాతాలంటే...జ్ఞాపకమొచ్చింది. పెదనాన్నగారికి పారిజాతాపహరణంలోని పద్యాలన్నీ వచ్చు..."

"మరి నీకూ..."

"ఔను నాకు గూడా నక్కా. నాకెన్ని పద్యాలు నేర్పారని. ముఖ్యంగా సత్యభామ... అలక..."

సంధ్యకు చెల్లెలి మాటల మీద నవ్వు వచ్చింది.

"అసలు...సత్య...భామ..."

ఇక సంధ్య నవ్వాపుకోలేక పోయింది. పుక్కిటనీళ్లు యిద్దరూ వెదజిమ్ముతున్నారు. సంధ్య అన్నది.

"ఇప్పుడు......ఈ చెరువుమధ్య నువ్విట్లా నుంచొని నాకు సత్యభామ అలిగిందని చెబుతూంటే...నిజంగా కృష్ణుడి జలక్రీడలు...నువ్వు సత్యభామలాగా వున్నావ్...నిజం!......చెదిరిన ముంగుర్లూ తడిసిన గుడ్డలూ...ఆ బంగారపు మెరిసే గాజులూ"

ఛాయ గూడా తన డొక్కలు పట్టుకొని పెద్దగా నవ్వటం ప్రారంభించింది.

"పోదూ...నువ్వు గూడా నన్నాటలు పట్టిస్తున్నావ్...సంధ్యక్కా...!

"ఊహూఁ! నే నన్నంత మాత్రంలో సత్యభామవైనావా నువ్వు ?...అసలు నీకు క్రిష్ణుడొకడుంటేగా...? నుళ్ళీ నువ్వు.

ఛాయనవ్వు మళ్లీ..."ఏం లేకేం...యీ పారిజాతాలు కోసింది నా క్రిష్ణుడికే..." ఛాయకళ్లు ఎక్కడో తేలిపోతున్నై.

"ఓహో...ఎవరు ?"

"మ...ధు..." ఛాయ చటుక్కున నాలిక కరచుకొన్నది. వాన జల్లులాగా సిగ్గువచ్చింది.

కళ్లువాల్చింది. తిరిగి నీళ్ళలో మునిగింది. పారిజాతాలు పైకెత్తి పట్టుకొని.

కాని సంధ్య నవ్వు ఆగిపోయింది. సన్నని కనుబొమలు విభ్రమతో ముడివడ్డాయి.

మధు...

తనవాడైన మధు......

తన స్వర్గంలో నల కూబరుడు తన స్వప్నాల్లో నాయకుడు...

చెఱువు...యీ దేవ స రస్సు...పారిజాతాలను, క్రిష్ణుణ్ణీ, సత్యభామను సృష్టించిన దేవసరస్సు—రంకులరాటం తిరిగినట్లుగా తిరుగుతోంది. ఆకసం చెఱువులో అల్ల కల్లోలాన్ని ముద్దెట్టుకోవటానికేమో కిందికి దిగివస్తోంది. బలవంతంగా తామరాకుల్ని పక్కలకు తోసేస్తూ, చిన్న అలలు కల్పిస్తూ ఈదుకుంటూ పోయింది ముందుకు.

“అక్కా—అటు సుడి వున్నదంటివే...నేను గూడా రానా...?”

సమాధానం లేదు. అప్పటికే సంధ్య చాలా దూరం పోయింది.

“అక్కా.... నేనూ...వస్తూన్నా...నువ్వక్కడే నిలు...ఆ లోతు దాటించిందాకా...”

ఛాయ అక్క కోసం ముందు చూడలేదు. ఆ దిక్కుగానే నీళ్లలో పాయలు చేసి, మునుగుతూ తేలుతూ ముందుకు యీదుతోంది.

“అక్కా...యిక్క...డ లో...తు”

“—...............—”

“సం....ధ్య...క్కా...! ...ఈ లో'...తు నాకు...అందటం.... లే...దు.”

సంధ్య మెడతిప్పి ఒకసారి చూసింది. గిరుక్కున అటు వేపు తిప్పుకొన్నది.

“అమ్మో...సం...ధ్య...క్కా!...నే...ను ...ము...ని...గి పో...తు......అ...మ్మో...!!”

సంధ్య కదలలేదు. వెనుదిరిగి గట్టు పట్టుకొని మరోసారి చూసింది. అప్పటికే ఛాయ తెల్లని భుజాలు నీటిమట్టం కిందికి జారిపోతున్నాయ్. పైకి తేలిన పారిజాతాలు, దేవసరస్సులో మానవులు కల్పించిన తరంగాల్లో నీటి వాలుకు కొట్టుకుపోతున్నై. నాలుగయిదు నీటిబుడగలు మాత్రం పైకి తేలినై. నీటిబుడగలు...జీవితాన్ని, దాని అంతాన్ని స్మృతికి తెస్తూ, ఎవరో దేవత దుర్మరణపు వ్యథతో, ఆమెకు ఎన్నెళ్ళో ఆసనంగా వున్న వుద్యానపు పాలరాతిశిల కరిగి కార్చిన కన్నీటిబొట్లుగా...నీటిబుడగలు... నాలుగైదు పైకి తేలినై.. అంతే!

౧౦

ఊళ్ళో హృదయంగల వాళ్ళందరూ చెప్పుకొన్నారు.

“ఆ చుప్పనాతిపిల్ల లావణ్య చెరువులో తోసిందట”

“పాపం”

“ఆ రెండో పిల్లసంధ్యకూ, యీ చచ్చిన పిల్లకూ...జంట...కవల జంట...పాపం! సంధ్యారాణి కుంగిపోతోన్నదట దుఃఖంతో”

“ఏం వినాశకాల మొచ్చిందమ్మా...ఆ లావణ్యకు”